కిషన్ అనేవాడు వీళ్ళిద్దరి వంకా చూసి కళ్ళేగురవేసి 'ఏంకావాలి?' అని అడిగాడు.

ఇద్దరూ కిషన్‌కి దగ్గరగా వెళ్ళారు.

అటూ ఇటూ చూసి 'నక్లెస్ ఉంది.....కొంటారా?' అని అడిగాడు రాంబాబు.

కిషన్ కూడా అటూ ఇటూ చూసి 'దొంగసొమ్మా?' అని అడిగాడు.

రాంబాబు మళ్ళీ అటూ ఇటూ చూసి 'కాదు' అని కిషన్ చూస్తుండగా కిష్టయ్య వంక చూసి కన్ను కొట్టాడు.

కిషన్ చమన్‌లాల్ దగ్గరికి వెళ్ళి మెల్లగా ఏదో చెప్పాడు.

చమన్‌లాల్ వీళ్ళిద్దరి వంకా చూసి కిషన్‌కి కన్నుకొట్టాడు.

కిషన్ రాంబాబు, కిష్టయ్యల దగ్గరికి వచ్చాడు.

'ఏది.....నగ చూపించండి' అన్నాడు.

రాంబాబు మళ్ళీ ఓసారి అటూ ఇటు చూసి జేబులోంచి నగతీసి కిషన్ చేతిలో పెట్టాడు.

కిషన్ గీటు పెట్టి నగని పరీక్షించాడు.

తరువాత నగని తూకం వేశాడు. దాని బరువు అయిదు తులాలు ఉంది.

'అయిదు వేలిస్తాం.....' అన్నాడు కిషన్.

'అదేంటి?....తులం ఖరీదు రెండువేలు కదా? అయిదు తులాలు ఖరీదు పదివేలు అవుతుంది'..... అన్నాడు రాంబాబు మీసం మెలేస్తూ.

'దొంగ సొమ్ముకి కూడా పూర్తి ఖరీదు ఇస్తారా ఎవరైనా?'

'దొంగ సొమ్ము కాదని చెప్పాంగా ?....'

'మీరు చెప్తే మేము నమ్మొద్దూ.....మీ లాంటి వాళ్ళని మేము ఈజీగా గుర్తుపడ్తాం......'

'పోనీ రెండువేలు తగ్గించుకుని ఎనిమిది వెలిస్తావా?' మళ్ళీ మీసం మెలేస్తూ అన్నాడు రాంబాబు.

'కుదర్దు...... అయిదు వేలకి ఒక్క పైసా ఎక్కువ ఇవ్వాలన్నా కుదర్దు. ఇలాంటి దొంగ సొమ్ము కొనటంలో చాల రిస్కు ఉంది...... పోలీసులు పట్టుకుంటే మీతోబాటు మమ్మల్ని కూడా లోపలేసేస్తారు.....' అన్నాడు కిషన్.

రాంబాబు గంభీరంగా చూస్తూ మీసం మెలేశాడు. కిష్టయ్య రాంబాబు వీపుమీద గోకాడు. రాంబాబు కిష్టయ్య వంక ప్రశ్నార్థకంగా చూశాడు.

'మీరు అదే పనిగా మీసం మెలేస్తున్నారు.... అదెక్కడ ఊడి పోతుందోనని నేను భయపడి చస్తున్నాను' చెవిలో అన్నాడు కిష్టయ్య.

రాంబాబు నాలుక కొరుక్కున్నాడు. తరువాత కిషన్ వైపుకి తిరిగి 'అంతేనా?' అన్నాడు.

'అంతే ' అన్నాడు కిషన్ నగని రాంబాబు చేతిలో పెట్టేస్తూ.

'హు...... ఆ వీరూగాడు ఎక్కడికి వెళ్ళినా ఎక్కువ ధరపలికించుకుని వస్తాడు. మనం

ఎక్కడికి వెళ్ళినా సగం ధరే ఇస్తానంటారు అందరూ.....' అన్నాడు రాంబాబు.

'వాడు గుండుతో కండల్తో భయంకరంగా ఉంటాడు కదా..... అందుకే ఎక్కువ ధర ఇస్తారు. ఇలా బక్కగా ఉండే రౌడీలంటే ఎవరికి మాత్రం విలువ ఉంటుంది.... మనం రేపట్నుండి ఎక్సర్సైజులు చేసి కండలు పెంచాలి!' అన్నాడు కిష్టయ్య.

'మీకు వీరూ తెల్సా?' ఒక్కసారిగా కిషన్ కుతూహలంగా అడిగాడు.

'నీకు తెల్సా?....' ఇద్దరూ ఒక్కసారిగా కిషన్ మొహం మీదికి వంగి ఆతృతగా, కంగారుగా అడిగారు.

'తెల్సు..... అతను మా రెగ్యులర్ కస్టమర్ ...... అందుకే అతనికి కాస్త ఎక్కువ ధర ఇస్తాం.....మీరు కూడా మాకు రెగ్గులర్ కస్టమరైతే మీకూ ఎక్కువ ధర ఇస్తాం..... ఇంతకీ మీకూ వీరూ తెల్సా?.....' అడిగాడు కిషన్.

'తెలీక పోవడం ఎంటీ ..... వాడు నేను బాగా ఫ్రండ్స్. ఇద్దరం ఒక దగ్గరే ఈ విద్య నేర్చుకున్నాం..... తరువాత నేనొక గ్యాంగులో చేరి పోయాను....వాడు స్వంతంగా ప్రాక్టీసు చేస్తున్నాడో లేకపోతే ఏదైనా గ్యాంగులో చేరాడో తెలీదు....' అన్నాడు రాంబాబు.

'గ్యాంగులోనే ఉన్నట్టున్నాడు'

'వాడిని చూసి నాలుగైదు సంవత్సరాలైంది ..... వాడిని చూడాలని ఉంది....నీకు వాడి ఎడ్రసు తెల్సా?'

'ఎందుకు తెలీదూ?.... మీలాంటి వాళ్ళఎడ్రసులు ఉంచుకోకపోతే ఎలా?.... రేపు పొద్దున్న పోలీసులు దొంగ వస్తువుల్ని మా దగ్గర పట్టుకుంటే మేము ఎవరి దగ్గర కొన్నామో చెప్పొద్దూ?....'

'అయితే వీరూ గాడి ఎడ్రసు కాస్త ఇస్తావా?....'

'వీరూ హిమాయత్‌నగర్‌లో ఉంటాడు.....' చెప్తున్నాడు కిషన్.

ఆ రోజు సరోజ కోసం హిమాయత్‌నగర్‌లో ఎదురు చూస్తుండగా ఇరానీ హోటాల్లో క్యాష్ దోచుకుని లిడ్‌క్యాప్ పక్కసందులోంచి వీరూ పారిపోయి మాయమవడం గుర్తు తెచ్చుకున్నాడు రాంబాబు.

రాంబాబు , కిష్టాయ్య ఇప్పటికి అలా పది బంగారు షాపుల్లో ఎంక్వయిరీ చేశారు.... చివరికి వాళ్ల శ్రమ ఫలించింది.

కిషన్ చెప్పిన ఎడ్రసు, ఇంటి గుర్తులూ నోట్ చేసుకున్నాడు రాంబాబు.

'మరి నగ ఇస్తున్నారా?' కిషన్ అడిగాడు.

'ఎనిమిది వేలకి ఒక్క పైసా తక్కువకి ఇచ్చేది లేదు.....' అన్నాడు రాంబాబు.

కిష్టయ్య, రాంబాబు హడావిడిగా షాపు బయటికి నడిచారు.

***వీరూ ఇంట్లో గొడవ!!***

హిమాయత్ నగర్‌లో .... .....

ఆ సందులో ..... ఆ యింటి ముందు.... .....

రాంబాబు, కిష్టయ్య దాదాపు ఒక గంటనుండీ ఎలక్ట్రిక్‌పోల్ కింద నిల్చుని ఆ యింటినే గమనిస్తున్నారు.

ఆ యిల్లు సందు చివరగా ఉండడం చేత విడిగా ఓ మూల ఉండడం చేత వాళ్ళిద్దర్నీ గమనించేవారు ఎవరూ లేరక్కడ. అదీ కాక అది అందరూ స్కూళ్ళలో ఆఫీసులో ఉండే సమయం....కాబట్టి జన సంచారం లేదు.

గంటనుండి ఆ యింటినే గమనిస్తుండటం చేత వాళ్ళకు విషయం అర్థం అయ్యింది. ఆ యింట్లో ఒక్క ఆడ మనిషి తప్ప ఎవరూ లేరు. వీరూ ఇంట్లో లేడు ....ఎక్కడికో వెళ్ళాడు.

'ఆమె వీరూ పెళ్ళాం అయి ఉంటుంది......' అన్నాడు రాంబాబు.

'ఒక్క ర్తే ఉంది.... లోపలికి వెళ్దామా గురూగారూ?....' అన్నాడు కిష్టయ్య.

'బాబోయ్ ....నాకు భయంగా ఉందిరా కిష్టయ్యా.....'

'పోలీసులు .....ఉరి శిక్ష..... ఆ తరువాత మీ యిష్టం.......'

'సరే పద......' గుండె చిక్కబట్టుకుని అడుగులు ముందుకు వేశాడు రాంబాబు, కిష్టయ్య రాంబాబుని అనుసరించాడు. వాళ్ళిద్దరూ ఇందాక బంగారం షాపులోకి వెళ్ళినప్పటి మారువేషాల్లోనే ఉన్నారు.

ఇద్దరూ వీధి గుమ్మం దగ్గరికి వచ్చారు.

'ఊ.....తలుపు తట్టండి గురూగారూ' అన్నాడు కిష్టయ్య.

'చేతులు వణుకుతున్నాయ్ రా.....' అన్నాడు రాంబాబు.

'పోనీ కాలుతో తన్నండి......'

రాంబాబు మెల్లగా తలుపు తట్టాడు. లోపలినుండి ఎలాంటి అలికిడీ రాలేదు.

ఈసారి కాస్త పెద్దగా తట్టాడు.

'ఎవరూ?' లోపల్నుండి ఆమె అడిగింది. ఇద్దరూ నిశ్శబ్దంగా నిల్చున్నారు.

పది క్షణాలు ఆగి మళ్ళీ తలుపు తట్టాడు రాంబాబు.

'ఎవరూ అని అడిగితే పలకరేం?....' ఆమె విసుగ్గా అరిచింది లోపలినుండి.

రాంబాబు, కిష్టయ్య ఉలకలేదు పలకలేదు. నిశ్శబ్దంగా తలుపు దగ్గర నిల్చున్నారు. కిష్టయ్య తలుపుమీద చెవి ఆనించి విన్నాడు. అడుగులు చప్పుడు వినిపించింది వాడికి.

'గురూగారూ......వస్తుంది...... రెడీగా ఉండండి......' రాంబాబు చెవిలో గుసగుసలాడాడు కిష్టయ్య.

తలుపు తెరుచుకుంది.

ఆమెకి ముప్పై అయిదేళ్ళుంటాయి. కొప్పు చుట్టుకుంది. దాంట్లో ముద్దమందారం పెట్టుకుంది. పెద్ద బొట్టు పెట్టుకుంది. చామన ఛాయతో కాస్త మోటుగా ఉంది. కానీ ఏదో ఆకర్షణ ఉంది ఆమె ముఖంలో.

ఆమె రాంబాబూ, కిష్టయ్యల వంక ప్రశ్నార్థకంగా చూసింది.

వాళ్ళు ఆలస్యం చెయ్యదల్చుకోలేదు. ఇద్దరూ ఒక్కసారిగా ఆమెని లోపలికి తోసి ఇంట్లోకి ప్రవేశించి లోపల్నుండి గడియపెట్టారు.

'అమ్మోయ్....నాయనోయ్......' అంటూ కంగారుగా అరిచింది వీరూ పెళ్ళాం.

'అరుస్తుంది.......ముందు దాని నోరుముయ్......' రాంబాబు కంగారుగా అన్నాడు కిష్టయ్యతో.

కిష్టయ్య ఆమె నోరు మూశాడు. మరుక్షణం కెవ్వున అరిచాడు, కిష్టయ్య.

'ఆమెని అరవకుండా నోరు ముయ్యమంటే నువ్వే అరుస్తావేం?..... చుట్టుపక్కల వెళ్ళు ఎవరైనా వినగలరు......' రాంబాబు మరింత కంగారుపడ్డారు.

'నోరు ముస్తే నా చేతిని కొరికేసింది గురూగారూ' చేతివేళ్ళు ఊదుకుంటూ చెప్పాడు కిష్టయ్య.

బాబోయ్.....అమ్మోయ్.....నాయనోయ్......' అందామె మళ్ళీ.

గురూగారూ ...ఆ మూలనున్న దుడ్డుకర్రతో నెత్తిన ఒక్క టెయ్యండి..... ఆరుస్తూంది' అన్నాడు కిష్టయ్య.

'దాంతో తలమీద కొడితే చస్తుందేమో!....'

'మరీ నెత్తి పగిలేలా కొట్టకండి....కాస్త మెల్లగా మూర్ఛపోయేలా కొట్టండి.....'

రాంబాబు కూడా ఆమె వంక భయం భయంగా చూశాడు అంది అతని చేతులు జోడిస్తూ.

'నీ మాటనమ్మి మేము మానవి చేస్కునే టైంలో నువ్వరుస్తానో?' అన్నాడు కిష్టయ్య.

'నా నోట్లో గుడ్డాలు కుక్కడి అరవకుండా' చెప్పింది ఆమె.

చటుక్కునబయటకి పరుగెత్తి అందర్నీ పిలుచుకొస్తేనో?'

'నా చేతులూ, కాళ్ళూ కట్టేయండి' ఆమె సలహా ఇచ్చింది.

తమ సమస్యని అంత తేలికగా పరిష్కరించినందుకు ఇద్దరూ ఆమె వంక కృతజ్ఞతా పూర్వకంగా చూశారు.

కిష్టయ్య దండెంమీద ఆరవేసిఉన్న టవలుతీసి ఆమె నోట్లో దోపాడు.

'నువ్వు లోపలి గదిలోకి పద.....' ఆమెతో అన్నాడు రాంబాబు.

ఆమె గదిలోకి వెళ్లింది. అక్కడ చీరతో ఆమె చేతులూ కాళ్ళూ కలిపి కట్టేశాడు రాంబాబు.

తరువాత రాంబాబూ, కిష్టయ్య ఇద్దరూ ఇల్లంతా సోదాచేశారు.....కానీ వాళ్లకి ఏమీ ఆధారాలు దొరకలేదు.

'వీడు నగలని ఎప్పుడో అమ్మేసి ఉంటాడు. లేదా ఇంకెక్కడో మనకి తెలినిచోట దాచివుంటాడు' అన్నాడు రాంబాబు.

'ఏమ్మా.....మీ ఆయన దొంగ నగలు ఎక్కడ దాస్తాడో తెల్సా?' కిష్టయ్య ఆమెని అడిగాడు.

ఆమె తేలీదన్నట్టుగా తల అడ్డంగా ఊపింది.

'జగ్గూగాడి ఇంట్లో ఏమైనా దొరుకుతుందేమో!!' అన్నాడు రాంబాబు.

'నీకు మీ ఆయన స్నేహితుడు జగ్గూ ఇల్లు ఎక్కడుందోతెల్సా?' కిష్టయ్య ఆమెని అడిగాడు.

ఆమె తెలుసన్నట్టు తల ఊపింది.

'ఎక్కడ ?.....'

ముందామె నోట్లో గుడ్డలు తియ్ చెప్తుంది' అన్నాడు ఆంబాబు.

కిష్టయ్య ఆమె నోట్లో గుడ్డలు తియ్ చెప్తుంది' అన్నాడు రాంబాబు.

'లక్డీకాపూల్ లో.....' అంది ఆమె.

'లక్డీకాపూల్‌కి ఎక్కడ తీశాడు.

ఆమె చెప్పింది.

సరిగ్గా అదే సమయంలో వీధి తలుపు దన దబదబ బాదారు ఎవరో.

రాంబాబు , కిష్టయ్య కంగారు పడ్డాడు.

'లక్ష్మి.....' గట్టిగా అరుస్తూ మళ్ళీ బాదారు.

'ఎవరు?' అంటూ ఆమెని అడిగాడు రాంబాబు.

'లక్ష్మీ .....' గట్టిగా అరుస్తూ మళ్ళీ బాదారు.

'మా ఆయనే ......' చెప్పింది ఆమె.

'ఈ ఇంటికి వెనకనుండి దారి ఉందా?!

లేదు....'

రాంబాబు, కిష్టయ్య మొహమొహాలు చూస్కున్నారు.

'నువ్వు ముందు చెప్పిన పనిచేశాడు.

వీరూ తలుపుమీదకొడ్తూనే ఉన్నాడు.

ఎలా?.... ఇప్పుడెలా తప్పించుకోడం తప్పించిపోవడం ??....

రాంబాబు కిష్టయ్యలు చురుకుగా అలోచించసాగారు.

## *ఫ్రేమ్ - 29*

### *హాయ్! బాస్!!....హాయ్! జగ్గూ!!*

రాంబాబు, కిష్టయ్య ఒక నిర్ణయానికి వచ్చారు.

'నాకు చెయ్యి వణుకుతుంది..... ఆ దుడ్డకర్ర నువ్వే అందుకో' అన్నాడు కిష్టయ్య చెవిలో రాంబాబు.

కిష్టయ్య దుడ్డుకర్ర అందుకున్నాడు.

రాంబాబు కిష్టయ్య మెల్లగా తలుపు దగరికి వెళ్లారు.

మళ్ళీ తలుపుమీద దబదబ దబదబ కొట్టాడు వీరూ.

రాంబాబు మెల్లగా తలుపు గడియ తీశాడు శబ్దం కాకుండా . ఇద్దరూ తలుపుకు

చెరోపక్క గోడకి అనుకు నిడబడ్డారు.

ఈ సారి తలుపుమీద కాల్తో బలంగా తన్నాడు వీరూ, తలుపులు బార్లా తెరుచుకున్నాయి.